# ది సిటీ

**4-30 నిమిషాలు ఉదయం.**

"నగరం...

'పొద్దున్నే నెత్తురు పులిమిన పావురాల్ని విసిరేస్తుంది. తలుపు సందుల్లోంచి జారిపడే శవాలకోసం గొంగలి పురుగులు కాపలాకాస్తాయి'

భానుడు రావడానికి ఇంకా గంటన్నర టైముంది. సిటీలైట్లు ప్రకాశిస్తున్నాయి. మంచుగడ్డలు రాలుతున్నంత చలి.... సైకిల్ క్యారియర్‌కు వున్న తొట్టెలో పాల పాకెట్లు పెట్టుకొని సైకిల్ తొక్కుతున్నాడు రవి. రవి వయసు పదకొండేళ్ళు. బూత్ దగ్గర క్యూలో నిల్చోలేని కొందరు రవిని పాకెట్లు తేవడానికి ప్రత్యేకంగా పెట్టుకున్నారు.

అంత చలిలో లేత శరీరం చిగురుటాకులా వణుకుతున్నా ఆ పని తప్పదు. కారణం.... ఆర్థికభారం అప్పుడే ఆ చిన్నారి భుజాలమీద పడింది. సైకిల్ భారంగా తొక్కుతుంటే వెనుకనించి 'బెల్' విన్పించింది. వెంటనే డెయిలీ పేపర్లు వేసే శ్రీను ఓవర్ టేక్ చేసి ముందుకొచ్చాడు.

"ఒరే శ్రీనూ.... ఏం సిన్మాలున్నాయిరా పేపర్లో" అడిగాడు రవి.

"ఛ నీయమ్మ.... ఇయ్యాల్ల సిన్మాబొమ్మలే ఎయ్యలేదు. అన్నీ సచ్చినోల్ల ఫోటోలే.... పంజాబ్‌లో పదిహేనట. అస్సాంలో వరదలట, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్లట" అంటూనే సైకిల్ దిగి ఓ ఇంట్లో తలుపు సందులోంచి పేపర్ వేసి మళ్ళీ స్పీడుగా వెళ్ళిపోయాడు.

"శ్రీనుగాడి పని నయం.... ఎవర్నీ నిద్ర లేపకుండానే వాడి పని చేసుకుంటాడు. తనయితే తలుపు తట్టి లేపి పాకెట్టు ఇవ్వాలి. అంతా విసుక్కుంటారు" తనమీద తనే జాలిపడ్డాడు రవి.

అజీర్తి విగ్రహాలకి సందుల్లోనే పరుగు పందాలు మొదలయ్యాయి...

ఓ ఇంటి తలుపుని నాలుగుసార్లు తట్టేసరికి... ఒళ్లు విరుచుకుంటూ తలుపు తీసిందొకావిడ. జుట్టు చెదిరి... సగం వూడిన చీరని చుట్టబెట్టి భుజాలమీంచి కొంగుంది కాని జాకెట్టు లేదని తెలుస్తోంది. చిరాగ్గా తల బైటికిపెట్టి క్రేట్ అందుకొని వెళ్లింది.

అలా చాలా పంచాడు. మరో ఎనిమిది పాకెట్లున్నాయి. అందులో ఆరు ఎస్.పి. గారింటివి. ఆ ఇంటి మలుపు తిరుగుతున్నప్పుడు చలికి కాళ్లు గడ్డకట్టినట్లయి దబ్బున సైకిల్‌మీంచి పడ్డాడు. అలా పడటంలో క్షణంలో నాలుగు పాకెట్లు వెనుక చక్రంక్రింద పడి... దబ్ దబ్ మని పగిలి రోడ్డంతా క్షీరాభిషేకం కావటం జరిగింది. కాంపౌండ్‌లో జాగింగ్ చేస్తున్న ఎస్పీగారి కూతురు అది చూసి కళ్ళెర్రజేసింది. అంత చలిలోనూ రవి కళ్లలోంచి కన్నీళ్లు వేడిగా జారుతున్నాయి భయంకొద్దీ.

"ఈడియట్... ఈ రోజు బోర్న్‌విటా ఎలా త్రాగేదిరా? మా 'బంటి' కూడా ఏం తాగుతుందనుకున్నావ్... డామిట్..." ఆమె గేటు తీసుకొని ముందుకొస్తుంటే భయం భయంగా వెనక్కి నడిచాడు రవి...

ఎస్పీగారి కూతురు ఒక్కసారి వెనక్కి తిరిగి "బంటీ కమ్ హియర్..." అని పిల్చింది. ఒక అల్సేషియన్ కుక్క పరుగున రాగానే 'క్యాచ్ హిమ్' అని అరచింది.

అంతే...

పరుగు...పరుగు...పరుగు...

చలికి రక్తం గడ్డకట్టినట్లున్న కాళ్ళతో అడుగులెలా పడుతున్నాయో కూడా తెలీదు రవికి.... రోడ్లు.... సందులూ... వెనుక బొచ్చుకుక్క అరుస్తూ.

రైలుకట్ట ఎక్కి పట్టాల వెంట పరిగెత్తి.... పరిగెత్తి అలసిపోయి వగరుస్తూ వెనక్కి చూస్తే కుక్కలేదు... పట్టాలమీదే ఆయాసంగా కూల బడ్డాడు. లేత చెంపలమీదినించి కన్నీళ్లధార పారుతూనే వుంది.

అసహ్యంగా అమ్మానాన్నని తిట్టుకున్నాడు....

రైలొచ్చినా సరే.... లేవను.... రవిలో మొండిధైర్యం! రెడ్‌లైటు వెలుగుతూనే వుంది.

దడ దడ దడ దడ దడ

ఎక్కన్నించో పట్టాల ప్రకంపనాల ధ్వని....

8.00 గంటలు: ఉదయం.

"గొట్టాల గొంతుల్లోంచి కాలిపోయిన శ్వాస.

అశోక వృక్షాలని అంతస్థుల పైకి తీసికెళ్ళే సమయాన ....

నగరం నరాల మీద నగిషీల సందడి... తొక్కిసలాపై

నెత్తిమీద హెల్మెట్ పెట్టుకొని మృత్యువు చుట్టూ ఏడడుగులు...."

అంతా 'అయ్యో' అనేసి వెళ్లిపోతున్నారు. ఏ మృత్యువాహనమో ఢీ కొనిపోతే రక్తపు మడుగులో నిర్జీవంగా వున్నాడతను. చేతిలో మల్లె పూల పొట్లం...

మొదట చూసిన దృశ్యమైనపుడు 'అయ్యో పాపం' అన్న వాళ్లంతా... ఈ దృశ్యాలు సహజమయ్యేసరికి ఆ పదం కుదించబడి 'అయ్యో' అని జాలి కురిపించి జనం కదుల్తోంది.

"చేతిలో మల్లెపూలు... ఈరోజు మ్యారేజ్ డేనేమో"

"అందంగానే వున్నాడు... కావాలనే పడ్డాడో.... లారీగాని దూసుకు పోయిందో?"

"ఏ తల్లి కన్నదో.... నూరేళ్లు నిండాయి పాపం."

శవాన్ని పక్కకీడ్చి దారిమ్మనే హారన్‌ల సైరన్‌లు... క్షణాల్లో మున్సిపాలిటీ వ్యాను శవాన్ని లాక్కెళ్లిపోయింది సాయంత్రం టీవీల్లో,

రేడియోల్లో ఎనౌన్స్ చేస్తామంటూ....

కాని టీవీలున్న పెద్ద తరగతి, రేడియోలున్న మధ్యతరగతిది కూడా కాదా శవం. తను పూసుకున్న రక్తాన్ని వాహనాల చక్రాలకి పూసి హోళీ పండగ జరుపుకుంది రోడ్డు.

బిడ్డ రెండో పుట్టిన్రోజుకి ముద్దుగా జడవేసి, తీర్చిదిద్ది భర్త తెస్తానన్న మల్లెదండ కోసం ఎదురుచూస్తోంది అరుంధతి.

ఆమెకేం తెల్సు.... ఆ దండ తాలూకు తెలుపుదనమే తన శరీరమంతా పరుచుకుంటుందని. ఆమెకేం తెల్సు... కంకరరోడ్లలో ముడుచుకున్న మృత్యువు తన కన్నీటితో కంకణం కట్టుకుందని...

మార్చురీ గదిలోంచి తీసిన శవాన్ని కాల్చేయడానికి కట్టెలు లేవన్న సాకుతో అధికారుల ఆలోచనా ఫలితంగా... రైలుపట్టాల మీదికొచ్చి పడిందా శవం.

రెడ్‌లైటు వెలుగుతూనే వుంది.

దడ దడ దడ దడ దడ....

ఎక్కన్నించో పట్టాలవెంట ఇనుపచక్రాల ప్రకంపనాల ధ్వని.

12.30 నిమిషాలు.

"కరకురోడ్లమీద ఇరుకు జనాన్ని చూసి
ట్రాఫిక్ సిగ్నల్స్ చిరాకులో.... నకిలీ అగరొత్తుల వాసనలో
పేవ్‌మెంట్ మీద రోజూ చచ్చే శవం
గ్లిసరిన్ కన్నీళ్లు కురిసి...
చిల్లర వర్షం పడ్డ రాత్రి సారాయిలో జోగుతుంది"

మూడున్నర గంటల్నించి నిశ్చలంగా పడుకున్నాడు అయిదేళ్ళ రాజుగాడు. కదలకుండా, మెదలకుండా శవంవోలె. వాడి కడుపుమీద రక్తంలాంటి రంగుపోసి బావురుమని ఏడుస్తూనే వున్నాడు జోగులు. నడివయసు, చింపిరిజుత్తు, బుర్రమీసాలు, హృదయ విదారకంగా ఏడుస్తున్నాడు.

చిల్లర డబ్బులు పడుతున్నాయి.

ఏడ్చి ఏడ్చి... జనం పల్చబడ్డ సమయాన రాజుగాడ్ని గోనెసంచిలో గభాల్న చుట్టి రైలుకట్ట కింద సారాయి కొట్టుదగ్గర దించాడు.

"ఒరే నా కొడకా... ఈ రోజు అచ్చం సచ్చినోడి లెక్కనే యాక్షన్ చేసినవ్‌రా.... నీయమ్మ... ఇరవై రెండ్రూపాయలసిల్లర పడింది. ఇంద... రెండు రూపాయలు నువ్వుంచుకో...." అన్నాడు జోగులు.

"లేదన్నా.... వొళ్ళంతా నెప్పులు పెట్టింది. కదలక, మెదలక అన్ని గంటలు ఎండలో పండుకుంటే రెండు రూపాయలేనా.... ఇదివ్వు" అన్నాడు రాజుగాడు ఎర్రరంగు తుడుచుకుంటూ....

"యెల్లెహె... ఎదవ సచ్చినోడ... ఈ నాల్గు వుంచేసుకో" అని కొంత చిల్లర రాజుగాడి చిట్టి చేతుల్లో కుక్కి తను సారాయి దుకాణంలో దొరబడ్డాడు జోగులు. పీకల్దాకా త్రాగి... తూలుతూ పాటలు పాడుతూ రైలుపట్టాల మధ్యనించి నడుస్తున్నాడు. నడిచి, నడిచి జేబులోంచి మరో రెండు సారాపాకెట్లు తీసి పళ్ళతో చించి గటగటా త్రాగేసాడు.

ఒళ్ళు తూలింది. అడుగు పడలేదు మత్తుగా పట్టాలమీదే పడి పోయాడు.

రెడ్‌లైట్ వెలుగుతూనే వుంది. దడ్ దడ్ దడ్ దడ్ దడ్...

పట్టాల వెంట ఇనుపచక్రాల ప్రకంపనాల ప్రవాహం !

5.00 గంటలు: సాయంత్రం.

అక్కడ కన్నెప్పల్ని తొలుచుకుంటూ పాడుకున్నోడికి సర్‌గమ్...

పర్సులున్నోడికి స్వర్గం.

నగరం నాగరికత బుగ్గమీద పచ్చబొట్టు పొడిపించుకుంటే, అది

ఎంగిలి మెరుగుల రాచపుండై.... సంస్కృతిని తొలిచే గొంగళి

పురుగుల లుకలుకల వ్యవస్థ...."

ఇందిరాపార్క్ పొదవెనక....

"బోయ్‌ఫ్రెండ్ అంటూ వెంట తిరిగానే అనుకో.... ఇప్పుడు నెలతప్పింది. నువ్వు పెళ్ళి చేసుకోనంటే ఎలా ?" స్లీవ్‌లెస్‌ను సవరించుకుంటూ... ఆరిపోయిన లిప్‌స్టిక్‌ని నాలుకతో తడుపుకుంటూ అడిగిందామె అతన్ని.

"ఈ రోజుల్లో ఇవి కామన్.... ఏముంది అబార్షన్?" అన్నాడతడు. భుజాలపైకి పెరిగిన జుట్టును నిర్లక్ష్యంగా ఎగరేసుకుంటూ.

"కాని మా అమ్మకు తెలిస్తే...

"తెలిస్తే ఏముంది? మొన్న 'ఒబరాయ్'లో మీ అమ్మ బాగా తాగి స్వరాజ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎం.డి. గాడి ఒళ్ళో కూనిరాగాలు తీస్తోంది. సివిలైజ్డ్ ఫామిలీలో పుట్టి వర్రీ అవుతావా? నెవర్....?"

అతడి సిగరెట్ పొగ పడక ఆమె చిన్నగా దగ్గింది.

"కాని మా నాన్నకిలాంటివి నచ్చవు. అజయ్ ప్లీజ్.... పెళ్ళి చేసుకో"

"ఎలీషా! జస్ట్ ఎంజాయ్. అలా అంటే ఎందర్ని చేసుకోను? నువ్వింతకుముందు ముగ్గురి బోయ్ ఫ్రెండ్స్‌తో తిరిగావే... పోనీ వాళ్ళలో ఎవరినయినా చేసుకో... సారీ డియర్" అతడు లేచిపోయాడు. అంతకుముందే రెండుసార్లు అబార్షన్ చేయించుకుంది.

ఆమెకు జీవితం ఎలాగో తోచింది. క్లబ్బులు, పార్కులు, హోటళ్ళు, లాడ్జింగులు అన్నీ గిర్రున తిరిగాయి... తప్ప తాగి అర్ధరాత్రి ఇంటికివచ్చే మమ్మీ... లేడీ సెక్రటరీలతో గడిపే డాడీ. ఎవర్తితో లేవదీసుకొని స్టేట్స్‌కెళ్లిపోయిన అన్న.... అన్నీ గుర్తొచ్చి ఆమె ఇంటికెళ్ళలేక రైలుపట్టాలు వెదుకుతూ వెళ్లింది.

ఆమె వెళ్ళేసరికి రెడ్‌లైట్ వెలుగుతూనే వుంది.

దడ్ దడ్ దడ్ దడ్ దడ్ ...

ఎక్కన్నుంచో పట్టాలవెంట ఇనుపచక్రాల ప్రకంపనాల సవ్వడి.

రాత్రి 8.30 నిమిషాలు.

"స్కాచ్‌తో అభిషేకించిన స్తన్యపు మొనల్లో
ఖాకీలు లాటీలు గ్రుచ్చిన మథనానికి
వాళ్ల కన్రెప్పల జిప్పులాగి కార్చిన వీర్యపుచుక్కలు
నింగిని తాకే నక్షత్రాలై మెరుస్తాయ్...."

ఆమె గుడ్డి వెలుతురులో ఒక్కొక్క గుడ్డనే విప్పేస్తుంటే.... గుడ్లప్పగించి కళ్లని చీకట్లో సూర్యగోళాలు చేసి చూస్తూ చొల్లు కార్చుకుంటున్నారు. లయబద్ధమైన సంగీతం చీర విప్పింది, జాకెట్టు విప్పింది.

ఒకడు ఆమె బ్రా లోంచి పొంగుకొస్తున్న రొమ్ముల మీంచి గుప్పెడు పచ్చనోట్లు దిష్టి తీసినట్లు త్రిప్పి బ్రాలో కుక్కాడు. డాన్స్ అయిపోయింది.

రిపీట్ చేయమన్నారు. ఆమె డార్క్‌రూంలోకి వెళ్ళిపోయింది.

ఆ స్టార్ హోటల్లోకి ఆరోజే దిగిన నలుగురు కరోడ్‌పతులు 'ఆమె'ను కావాలన్నారు.

ముందు ఒప్పుకోలేదు.

కాని తర్వాత ఒప్పుకుంది. ఒకడు.... రాక్షసంగా రతించిపోయాక మరో కీచకుడు వచ్చాడు. కరెన్సీనోట్లు గదినిండా చిందరవందరవుతున్నాయి. మూడోవాడు కూడా అతి దారుణంగా ఆమెను రమించి పోయాడు. అప్పుడే టకటకమంటూ పోలీసు వచ్చింది. అప్పుడామె స్పృహ కోల్పోతున్న స్థితిలో వుంది.

గదినిండా పరచుకొన్న రూపాయిల్ని చూసి.... యస్.ఐ గారి కనుబొమ్మలు లేచాయి.

"రోజూ ఎంత సంపాయిస్తున్నావే లం..."

"నేను వ్యభిచారిణిని కాదు. కాని ఈ రోజు ..." గొంతులోంచి ఆ మాటరానే లేదు. వికటంగా నవ్వారు పోలీసులు. ఎస్సయి నడుమ్మీంచి పెఢీలుమని తన్నాడు. కళ్లు పూర్తిగా బైర్లు కమ్మాయి. మేనేజర్ వచ్చి సర్ది చెప్పటంతో అంతా సద్దుకుంది.

నాలుగోవాడు గదిలోకి వచ్చేసరికి ఆమె నిర్జీవంగా పడివుంది.

చచ్చిందని నిర్ధారించి అర్ధనగ్న సుందరిని రైలు పట్టాలపైకి తరలించారు. ఫైవ్‌స్టార్స్ దివ్యంగా వెలుగుతున్నాయి. ఆ వెలుగుల్లో తవెంత అన్నట్టు రెడ్‌లైట్ వెలుగుతోంది.

దడ్ దడ్ దడ్ దడ్ దడ్...

ఎక్కన్నించో పట్టాలమధ్య ఇనుపచక్రాల ప్రకంపనాల హోరు.

అర్ధరాత్రి 12.00 గంటలు.

"నగరం ఏడుస్తోంది...
చీకటి కూకటి వేళ్లతో ఏనుకోగా
'సమాంతర రేఖల' మీద గుర్తుతెలియని శవాలు
గుండెల్లో మురిగిపోతున్నప్పుడు...
నగరం చిక్కటి కన్నీళ్లు కారుస్తుంది"

కూతపెడుతూ పోయింది రైలు. తనకింద ఆరు దేహాల్ని అంగాంగక్షైమా చేసి పారిపోయింది. అన్ని రైళ్లు సమయానికి వచ్చిపోయాయి, కంకరరాళ్లు నెత్తురులో నాని మెత్తబడుతున్నాయి.

తనింక చూడలేనట్టుగా రెడ్‌లైట్ ఆరిపోయింది.

మరోరకం లైట్లు క్లిక్....క్లిక్....క్లిక్...మంటున్నాయి.

"నగరం....
ప్రొద్దున్నే రెక్కలు తెగిన పావురాల్ని విసిరేస్తుంది.
తలుపు సందుల్లోంచి జారిపడే శవాలకోసం
గొంగళి పురుగులు కాపలాకాస్తాయి. ★

★★
★★